క్లుప్తంగా

భైరవేశ్వరస్వామికి రుద్రాభిషేకం



రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

పోరుమామిళ్ల : పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం పోరుమామిళ్ల చెరువుకట్టపై ఏర్పాటు చేసిన వనభోజన, రుద్రాభిషేకం కార్యక్రమాలకు భారీగా జనం తరలివచ్చారు. కట్టపై వెలసిన శ్రీ భైరవేశ్వరస్వామి ఆలయంలో ఆర్యవైశ్యులు రుద్రాభిషేకం నిర్వహించారు. మహిళలు అక్కదేవతలకు, నాగులకు, ధ్వజస్తంబానికి, పురాతన శివాలయంలో, చెరువు నీటిలో పూజలు చేసి, దీపాలు పెట్టి, నమస్కరించారు.

తైక్వాండో బెల్ట్ గ్రేడ్ పరీక్షలు



తైక్వాండో బెల్టు గ్రేడ్ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీయూ బాలికల ఉన్నత పాఠశాల జవహర్ బాల కేంద్రంలో ఆదివారం విద్యార్థులకు తైక్వాండో శిక్షణలో భాగంగా బెల్టు గ్రేడ్ పరీక్షలు నిర్వహించినట్లు మాస్టర్ మునీశ్వర్ తెలిపారు. ఈ పరీక్షలో 28 మంది పాల్గొన్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు కిక్కింగ్, పంచెస్, కటాస్, బ్రేకింగ్, సెల్ఫ్‌డిఫెన్స్, టెక్నిక్స్ విభాగాల్లో పరీక్షలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు, బెల్టులను అందించారు.

బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న దాదాపీర్

పోరుమామిళ్ల : పట్టణంలోని గ్రంథాలయంలో ఇటీవల నిర్వహించిన 57వ గ్రంథాలయ వారోత్సవాల పోటీలలో విజేతలకు ఆదివారం బహుమతులు పంపిణీ చేశారు. లైబ్రేరియన్ ఆఫ్రిది ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20 వరకు జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో దేశభక్తి గేయాలు, వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు కార్తీక, ఆఫ్రిన్, మున్వర్, అతిఫా, నిహారిక, అవంతిక విజేతలుగా నిలచారు. వారికి రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ బహుమతులు పంపిణీ చేశారు.

దుప్పట్ల పంపిణీ



బద్వేలులో దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

బద్వేలు అర్బన్/పోరుమామిళ్ల : బద్వేలు, పోరుమామిళ్లలోని ఆర్టీసీ బస్టాండు, దేవాలయాలు, వివిధ ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న అనాథలు, సాధువులకు వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎలాంటి ఆదరణ లేకపోయిన వారు ఎవరైనా ఉంటే, తమ ఆశ్రమంలో ఉచితంగా ఆశ్రయం కల్పించి సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వెంకట సురేష్, కేతన శ్రీనాథ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి



కానిస్టేబుల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పట్టణానికి చెందిన కానిస్టేబుల్ మహబూబ్ సుభాన్‌బాషా (38) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆయన నరసాపురం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే వారు. ఇటీవల అనారోగ్యంతో బెంగళూరులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం ఉదయం ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, కో ఆర్డినేటర్ కల్లూరు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ సీఎం బాషా, ఎంపీటీసీ ఇస్సాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు సందర్శించి నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ పరామర్శించారు.

కాలజ్ఞాని గురువు.. వీరభద్రస్వామి

- నేడు చివరి కార్తిక సోమవార ప్రత్యేక పూజలు
- అల్లాడుపల్లెలో వైభవంగా పల్లకీ సేవ



అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి



భద్రకాళీమాత



కేథారీశ్వరుడు

చాపాడు : కాలజ్ఞానం రాసిన మద్విరాట్ శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి గురువుగా అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి పేరుగాంచారు. వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో కార్తిక మాసం చివరి సోమవారం ప్రత్యేక పూజలు, వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బ్రహ్మంగారు తన 12వ ఏటనే పశువుల కాపరిగా ఉన్న సమయంలో వీరభద్రస్వామిని గురువుగా భావించి ఆయన విగ్రహం ఎదుట చదువు నేర్చుకుని కాలజ్ఞానం రచించినట్లు ప్రతీతి. నంద్యాల జిల్లా బనగానపల్లెలో పశువుల మేపుకొనేందుకు వెళ్లి వీరభద్రుడి విగ్రహం ఎదుట కాలజ్ఞానం రచించగా.. అక్కడ కొలువుదీరిన ఆ విగ్రహం ఓ సారి కురిసిన భారీ వర్షాల వల్ల కొట్టుకునిపోయి కుందూనదిలో పడటం.. అక్కడి నుంచి ఇప్పుడున్న అల్లాడుపల్లెకు సమీపంలో నదిలో ప్రత్యక్షమైంది. ఇక్కడ పశువులను మేపుకొనేందుకు వచ్చే పిల్లలను నల్లటి రంగులో ఉండే వీరభద్రస్వామి.. వారిని కొట్టి, బెదరించి వారి చద్ది అన్నం ఆరగించేవారని, పిల్లలు ప్రతి రోజూ నిద్రించే సమయంలో కలవరబోతుండంతో గ్రామ ప్రజలందరూ ఓ రోజు నది వద్దకు రాగా వీరభద్రస్వామి కన్పించలేదు. దీంతో ఓ భార్యభర్తల జంట ఆత్మాహుతికి పాల్పడటంతో వీరభద్రస్వామి బయటికి వచ్చి తాను దేవుడినని తనకు పూజలు చేయాలని చెప్పటంతో.. నది నుంచి స్వామి వారిని ఊరేగింపుగా తెస్తుండగా ప్రస్తుతమున్న అల్లాడుపల్లె వద్ద రాత్రి స్వామి శిలగా మారారని.. అప్పటి నుంచి నేటి వరకూ స్వామి సన్నిధిలో రోజూ విశేష పూజలు చేస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు, వేద పండితులు తెలుపుతున్నారు.

వేలాది మంది భక్తులకు అన్నదానం

అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో కార్తిక మాసం చివరి సోమవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేస్తారు. స్వామి వారితోపాటు భద్రకాళీమాత, కేథారీశ్వరుడులకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఆలయ ప్రాంగణమంతా మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇదే క్రమంలో ఆలయ ప్రాంగణంలో వీరభద్రస్వామి, భద్రకాళీమాత విగ్రహ మూర్తులకు పల్లకీ సేవ వైభవంగా నిర్వహించనున్నారు. జిల్లా నలుమూలల నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఆలయం వద్ద వీరభద్రస్వామి సమేత, సర్వజన, ఆర్యవైశ్య అన్నసత్రాలలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తుల కాలక్షేపం కోసం పలు రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు



మైదుకూరు : కేక్ కట్ చేస్తున్న పాస్టర్ వినయ్‌కుమార్



చాపాడు : క్యాండిల్స్ పట్టుకుని ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

మైదుకూరు : పట్టణంలోని శాంతినగర్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం సాయంత్రం ముందస్తు క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ వినయ్ కుమార్ క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి సంఘ సభ్యులకు పంపిణీ చేశారు. సంఘ సభ్యులు పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

చాపాడు : చాపాడులోని సీఎస్ఐ చర్చి వద్ద సఫోజ్ క్రిస్మస్ వేడుకలు, క్యాండిల్స్ పండుగలను ఘనంగా నిర్వహించారు. సీఎస్ఐ చర్చి వద్ద ఫాస్టర్ రెవరెండ్ మారం సత్యరాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని నెల రోజుల ముందు నుంచే క్రైస్తవులు సఫోజ్ క్రిస్మస్ వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ గ్రామ పెద్దలు, సంఘస్తులు తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు : స్థానిక క్రీస్తురాజపురం చర్చిలో క్రీస్తు రాజు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాస్ రోడ్డు నుంచి చర్చి వరకు ఏసు క్రీస్తు శిలా రూపాన్ని ఊరేగించారు. దువ్వూరు చర్చి విచారణ గురువు సల్లా మనోహర్, ప్రకాశం, విజయరాజు, విజయ్, సుశీల్ కుమార్, చర్చి యూత్ కమిటీ సభ్యులు వినయ్, అరుణ్, ప్రవీణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా రాణిస్తేనే విలువ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నేతలు

కడప కల్చరల్ : తొగట వీర క్షత్రియులు ఒకరికొకరు సహకరించుకుంటూ రాజకీయంగా ఎదగాలని, అప్పుడే వారికి సమాజంలో విలువ పెరుగుతుందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఆదివారం కడప నగర శివార్లలోని కనుమలోపల్లి 108 శివలింగాల మహాలింగేశ్వర స్వామి సన్నిధిలో తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర శాఖ ఆధ్వర్యంలో కార్తిక మాస వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ ఒకే నాయకత్వం కింద పని చేస్తే రాజకీయంగా ఎదిగే అవకాశం ఉందని, రాజకీయ పార్టీలు కూడా అలాంటి వారిని గుర్తించి పెద్దపీట వేస్తాయన్నారు. రాష్ట్రంలో తొగట వీర క్షత్రియ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. పిల్లలకు పెద్దలకు ఆటలు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు కళ్యా సుధాకర్, పల్లా నరసింహారావు, మహిళ అధ్యక్షురాలు సురువు శ్రీలత, రాయలసీమ అధ్యక్షులు బొమ్మల వెంకటరత్నం బండారు సూర్యనారాయణ, ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, టేకూరు సుదర్శన్, పల్లా మురళి కృష్ణయ్య, చౌడం సూరిబాబు, సుంకర రామచంద్రుడు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



బెడుసుపల్లె ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న గ్రామ పంచాయతీ అధికారులు

గోపవరం : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఈఓపీఆర్‌డీ హసీనా తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ఆదివారం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయడం, రోడ్డు పక్కన ఉన్న ఎరువు దిబ్బలు తొలగించడం తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రాచాయపేటలో రోడ్డు పక్కన వేసిన ఎరువు దిబ్బలను డంపింగ్ యార్డుకు తరలించడం జరిగిందని, ఇకపై ఎవరూ కూడా రోడ్డు పక్కన ఎరువు దిబ్బలు వేయవద్దని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామ సచివాలయం ఆవరణలో శుభ్రం చేయించి మట్టిని తోలడం జరిగిందన్నారు. బెడుసుపల్లె దళితవాడలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యను తొలగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కంపోస్టు తయారీపై అవగాహన పెంచుకోవాలి



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్ : ఇంటి వద్దనే సులభంగా కంపోస్టు ఎరువు తయారు చేసుకునే విధానంపై మహిళలు అవగాహన పెంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శివానగర్‌లో ఆదివారం మహిళలకు కంపోస్టు తయారీ విధానం, దాని వలన కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే మెప్మా సిబ్బంది ద్వారా మెప్మా సంఘాలలోని 14 వేల మంది సభ్యులకు జనవరి నుంచి శిక్షణ ఇప్పించడంతో పాటు నాణ్యమైన ఆకుకూరలు, కూరగాయల విత్తనాలు సరఫరా చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమణయ్య, ఇంజనీరింగ్, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

‘దేవాలయాలను పరిరక్షించుకుందాం’



మాట్లాడుతున్న విశ్వ హిందూ పరిషత్ నాయకులు

బ్రహ్మంగారిమఠం : దేవాలయాలను పరిరక్షించుకుందామని విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు యత్తపు గురివిరెడ్డి, ప్రొద్దుటూరుకు చెందిన జిల్లా సహాయ కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. బి.మఠంలో ఆదివారం ఏర్పాటు చేసిన విశ్వహిందూ పరిషత్ సమావేశంలో వారు మాట్లాడారు. హిందూ దేవాలయాల పైనే ప్రభుత్వాలు పెత్తనం చెలాయిస్తున్నాయని పేర్కొన్నారు. దేవాలయాల పరిరక్షణను స్వయం ప్రతిపత్తి కల్గిన ధార్మిక పరిషత్‌కు అప్పచెప్పాలన్నారు. ఇందుకోసం 2025 జనవరి 5న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావానికి తరలి రావాలన్నారు. పూర్తి సమాచారం కోసం ఫోన్ నంబర్: 9240015333ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.నారాయణస్వామి, బాలగురవయ్య, వై శ్రీనివాసులు, భజన రమణయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

దువ్వూరు : దువ్వూరు మండలం మూడిండ్లపల్లె గ్రామ సర్పంచ్ మంచాల రాజగోపాల్ రెడ్డి తండ్రి మంచాల సంజీవరెడ్డి శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆదివారం ఉదయం మూడిండ్లపల్లెలోని సంజీవరెడ్డి స్వగృహానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను రెడ్యం పరామర్శించారు. దువ్వూరు మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన జేష్టాది మధుబాబు సతీమణి సంతోషి శనివారం మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మంచాల ఈశ్వరరెడ్డి, తుమ్మల మస్తాన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



ఎస్.వెంకటాపురం కాలనీలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కర్‌బాబు

అట్లూరు : మండల పరిధిలోని పలు గ్రామాలలో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మండల అభివృద్ధి అధికారి భాస్కర్‌బాబు ఆదివారం పరిశీలించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్లు నిర్మిస్తున్నారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అసిస్టెంటు అశోక్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పార్కు అభివృద్ధికి చర్యలు



పార్కులో సందర్శకులతో మాట్లాడుతున్న డీఈ ప్రభాకర్ దాస్

ప్రొద్దుటూరు : స్థానిక వైఎంఆర్ కాలనీలోని మున్సిపల్ పార్కు అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.30 లక్షలు మంజూరైనట్లు డీఈ కె.ప్రభాకర్ దాస్ తెలిపారు. ఆయన పార్కును పరిశీలించి అంచనాలను తయారు చేశారు. పార్కు చుట్టు ప్రహరీ నిర్మాణంతోపాటు వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేయడంతోపాటు అన్ని విధాలా సుందరీకరణ పనులు చేస్తామని పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పనులు మంజూరైనట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈ దస్తగిరి ఉన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న కరస్పాండెంట్, ఎన్‌సీసీ సుబేదార్ మేజర్

బద్వేలు అర్బన్ : ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం బాధ్యతగా భావించాలని రాచపూడి నాగభూషణం విద్యాసంస్థల కరస్పాండెంట్ వెంకటసాయిక్రిష్ణ, ఎన్‌సీసీ సుబేదార్ మేజర్ రూపేందర్‌సింగ్ పేర్కొన్నారు. రాచపూడి నాగభూషణం డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ, నేవీ, ఎయిర్‌వింగ్ విద్యార్థులతో కలిసి ఆదివారం స్థానిక నెల్లూరు రోడ్డులోని కళాశాల ప్రాంగణం నుంచి రూపరాంపేట శివాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవాళి మనుగడకు చెట్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. వాతావరణంలో సంభవిస్తున్న అనేక రకాల మార్పులకు ముఖ్య కారణం చెట్లు అంతరించిపోతుండమేనని ఇటీవల కాలంలో అధ్యయనాలు తెలుపుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు చక్కటి వాతావరణం, ఆరోగ్యకరమైన గాలి అందాలంటే అందరూ మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. అదే భవిష్యత్ తరాలకు మనం ఇచ్చే ఆస్తి అని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఎన్‌సీసీ ఏఎన్‌ఓ లెఫ్టినెంట్ బాలఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా అయ్యప్ప గ్రామోత్సవం



రథంపై అయ్యప్పస్వామి ఊరేగింపు

మైదుకూరు : మైదుకూరులో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఆదివారం సాయంత్రం కనుల పండువగా నిర్వహించారు. పూలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చారు. అనంతరం పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారులలో ఊరేగించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారణ చేసిన భక్తులు భజనలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు.

నేడు ఖాజీపేటలో..

ఖాజీపేట : ఖాజీపేటలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేస్తారు. అనంతరం ఊరేగింపు ఉంటుంది.

భక్తిశ్రద్ధలతో గౌరీదేవి నిమజ్జనం



గౌరీదేవిని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

మైదుకూరు : మైదుకూరులో కార్తిక మాసం సందర్భంగా ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం గౌరీదేవి నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ బుధవారం ఆర్యవైశ్య మహిళలు అమ్మవారిశాలలో గౌరీదేవిని ప్రతిష్టించిన విషయం తెలిసిందే. నాలుగు రోజులపాటు ప్రత్యేక పూజలు, వ్రతాలు నిర్వహించారు. ఆదివారం ఊరేగింపుగా స్థానిక ఎర్రచెరువు వద్దకు తీసుకెళ్లి అక్కడ చెరువులో గౌరీదేవిని నిమజ్జనం చేశారు. అనంతరం ఆర్యవైశ్యులంతా వనభజన మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్, శ్రీశైలం బోర్డు మాజీ సభ్యురాలు మాధవిలత, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు మాలేపాటి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తిక ధాత్రి సమారాధన



శివలింగానికి అర్చన చేస్తున్న వేద పండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొవ్వూరు వృద్ధాశ్రమంలో ఉన్న కల్యాణమండపంలో ఆదివారం బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బ్రాహ్మణ కార్తిక ధాత్రి సమారాధన నిర్వహించారు. ఉదయం శివలింగానికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. బ్రాహ్మణులు, మహిళలు, పిల్లలు కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనలు, విచిత్ర వేషధారణలను నిర్వహించి ఉత్సాహంగా గడిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. బ్రాహ్మణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కంబగిరి రావు, బ్రాహ్మణ ప్రముఖులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హేమాంజలి

ప్రొద్దుటూరు : స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని రాజీవ్ గాంధీ నేషనల్ పార్కులో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్తిక మాస వనభోజన కార్యక్రమం, సంస్థ నెలవారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హేమాంజలి మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు అభినందనీయమని తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఇండ్ల భాగ్యలక్ష్మి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించిన కార్యక్రమాలను, కార్తీక వనభోజనం గురించి వివరించారు. సంస్థ వ్యవస్థాపకులు, కేంద్ర నియంత్రణ కమిటీ అధ్యక్షుడు ఎన్.రామచంద్రారెడ్డి ఉపనిషత్తులు, ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సంస్థ చైర్మన్ వంకదార కళావతి సంస్థ దివ్యాంగులకు, పేద ప్రతిభా విద్యార్థులకు అందిస్తున్న సేవలను వివరించారు. దివ్యాంగురాలు శైలజ కుమారుడు ఎస్వీ అభినయ్ చదువు కోసం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. క్విజ్ ప్రోగాం నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్, కార్యదర్శి మాలేపాటి సుబ్రహ్మణ్యం, సంయుక్త కార్యదర్శి సత్యనారాయణ, ఈసీ మెంబర్లు సువర్ణ, మునిశేఖర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, కో చైర్మన్ రామచంద్రుడు, కన్వీనర్ నరసింహులు, డైరెక్టర్లు శ్రీధర్, రమణారెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

27న ఐఎంఎల్ డిపోలో వేలం



ఐఎంఎల్ డిపో మేనేజర్ తిమ్మానాయుడు

ప్రొద్దుటూరు క్రైం : పాత మద్యం దుకాణాల్లోని సామగ్రికి ఈ నెల 27న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రొద్దుటూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపో మేనేజర్ తిమ్మానాయుడు తెలిపారు. ప్రొద్దుటూరు శివారులోని ఐఎంఎల్ డిపోలో ఉదయం 10 గంటల నుంచి వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఎక్సైజ్ కమిషనర్ ఆదేశాల మేరకు డిపోలోని 82 ఫ్రిజ్‌లు, 84 బ్యాటరీ ఇన్వర్టర్లు, 981 క్యాష్ బాక్స్‌లు, 168 స్కానర్లు, 83 క్యాష్ కౌంటింగ్ మిషన్లు, 84 కంప్యూటర్లు, 84 ప్రింటర్లు, 204 ఐరన్ ర్యాక్‌లు, 273 టేబుళ్లు, చైర్లు, ఫ్యాన్లను బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు రూ.5 వేలు ముందస్తు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. డిపాజిట్ చెల్లించిన వారికి వేలం రోజున ఉదయం 9 గంటలకు ఎంట్రీ పాసులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పాస్‌లు లేని వారికి డిపో ఆవరణలోకి అనుమతి ఉండదన్నారు. ఇతర వివరాలకు 9515656533 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీ ప్రకారం వలంటీర్లను కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. ఆదివారం స్థానిక డీవైఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వలంటీర్లను తొలగించబోమని, రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి ఎన్నికలు పూర్తయిన తర్వాత ఆ హామీని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇటీవల జరిగిన శాసన మండలి సమావేశాల్లో మండలి సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి వలంటీర్లు విధుల్లో లేరని చెప్పడం సరైంది కాదన్నారు. వలంటీర్లు చేసే పోరాటానికి డీవైఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు మస్తాన్‌షరీఫ్, రూరల్ అధ్యక్షులు ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి



ఉయ్యాలవాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం సభ్యులు

ప్రొద్దుటూరు : రేనాటి సూర్యుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని ఆయన విగ్రహానికి రేనాటి సూర్యచంద్రుల సేవా సంఘం ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గొప్పతనాన్ని సంఘం నాయకులు స్మరించుకున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ స్వరూప్ కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బూతూరు వెంకటరామిరెడ్డి, ఉపాధ్యక్షుడు, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ టంగుటూరు మారుతిప్రసాద్, కోశాధికారి కోటా ఓబుళరెడ్డి, పోతిరెడ్డి మురళీనాథరెడ్డి, కేతన్ ఆదిత్యరెడ్డి, బసిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, మురుకూటి నారాయణరెడ్డి, ఏరువ లక్ష్మిరెడ్డి, రామచంద్రారెడ్డి, వీరన్న, బాష, గురుమోహన్‌రెడ్డి, దస్తగిరి, నంద్యాల వెంకట శివారెడ్డి, ఎర్రన్న, సాయికుమార్, పద్మవీరన్న, యడవల్లి రమణయ్య, బైరెడ్డి అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కొర్రపాడు రోడ్డులోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఏపీ రెడ్డి సంఘం రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఎల్లారెడ్డి, ప్రొద్దుటూరు మండల వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు కృష్ణమోహన్‌రెడ్డి, పుల్లారెడ్డి, నారుపల్లె లక్ష్మీనారాయణరెడ్డి, కోటా ఓబుళరెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.